క్లుప్తంగా

200 మందికి అన్నదానం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం 200 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. తొలుత ప్రాంగణంలో వేంచేసి ఉన్న భూదేవీ, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణకు సహాయం అందించేవారు దేవాలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. శ్రీవారి పూజలకు వినియోగించిన పూలతో తయారైన అగర్‌బత్తి, సోప్‌లను కార్యాలయ ఉద్యోగులు విక్రయించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సూరపనేని శ్రీ చౌదరి, బిల్లా అమృత్ సూర్యకేదారేష్, శ్రీనివాసరావు, గంగాభవానీ పాల్గొన్నారు.

24 నుంచి భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు 75 రోజుల పాటు శివరామకృష్ణక్షేత్రంలో విశిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం నవచండీ హోమం, చండీ పారాయణం పూర్ణాహుతి నిర్వహిస్తునట్లు తెలిపారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గండూరి చంద్రమౌళీ పాల్గొన్నారు.

రుద్రశంకర్‌కు వెలంపల్లి పరామర్శ



భవానీపుర(విజయవాడపశ్చిమ):ప్రమాదవశాత్తు శరీరం కాలిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త, చల్లంరాజు సత్రం ట్రస్ట్ మాజీ డైరెక్టర్ రుద్రశంకర్‌ను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో టీ స్టాల్ నడుపుతున్న రుద్రశంకర్ శుక్రవారం ఉదయం పనిలో ఉండగా కాగుతున్న టీ ప్రమాదవశాత్తు అతని మొఖం, ఛాతీపైపడి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెలంపల్లి శ్రీనివాసరావు శనివారం మధ్యాహ్నం రుద్రశంకర్ ఇంటికి వచ్చి పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్న వెలంపల్లి మెరుగైన వైద్యం కోసం ఏదైనా హాస్పటల్‌కు వెళతానంటే తాను పంపించి చికిత్స చేయిస్తానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోదిలి చంటిబాబు, డీవీ రెడ్డి, ఆర్ వెంకట్, చిచా, శ్రీకాంత్, మంటి రాము, సరగడ శంకరరెడ్డి, పాశం శ్రీనివాస్, మణి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో గాయపరిచిన ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):చిన్న పాటి వివాదంతో కత్తితో దాడి చేసి గాయపరిచిన ఇద్దరిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాత రాజరాజేశ్వరిపేట మహంకాళమ్మ గుడి ప్రాంతంలో యక్కి. గబ్బర్ కుటుంబం నివాసం ఉంటుంది. గబ్బర్ శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిలబడి ఉండగా, షేక్. అతాఉల్లా, ఇంతియాజ్‌లు బైక్‌పై వేగంగా వెళ్లుతున్నారు. పిల్లలు ఆడుకునే రోడ్డు కాస్త చూసుకుని వెళ్లాలని గబ్బర్ వారించాడు. దీంతో అతాఉల్లా, ఇంతియాజ్‌లు గబ్బర్‌తో గొడవ పడటమే కాకుండా ఇక్కడే ఉండరా... నీ అంతు చూస్తామని చెప్పి బెదిరించి వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో మద్యం తాగి వచ్చిన అతావుల్లా, ఇంతియాజ్‌లు ఇంట్లో ఉన్న గబ్బర్‌ను రోడ్డు మీదకు లాక్కుని వచ్చి అరటి కాయలు కోసే కత్తితో దాడికి పాల్పడ్డారు. దీంతో గబ్బర్ ఎడమ చెవి కింద, ఎడమ చేతి భుజంపైన, కంటిపైన కత్తి గాయాలయ్యాయి. గబ్బర్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే సరికి ఆ ఇద్దరు నిందితులు పరారయ్యారు. గబ్బర్‌ను బంధువులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ నిలిపివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కబేళా, ఊర్మిళానగర్, జోజినగర్, లక్ష్మీనగర్ కాలనీ, సితార జంక్షన్, రాము క్వారీ సెంటర్, చెరువు సెంటర్, మర్రి చెట్టు సెంటర్, పోలీస్ కాలనీ, లలితానగర్, విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, లేబర్ కాలనీ, కోట నాగేశ్వరరావు వీధి ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయాల్లో కరెంట్ నిలిపివేస్తామన్నారు.

గంజాయి బ్యాచ్‌లతో జనం బెంబేలు

- అడ్డాగా కొట్టేటి కోటయ్య వీధి
- చీకటి ప్రదేశాలే స్థావరాలు
- ఆటోల్లో కూర్చుని మద్యం, గాంజా, డ్రగ్స్ సేవనం
- ద్విచక్రవాహనాల దహనం వారిపనేనంటున్న స్థానికులు



తగులబడిన వాహనాలను పరిశీలిస్తున్న వెలంపల్లి (ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యం సేవించే బ్యాచ్‌కు విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని కొట్టేటి కోటయ్య వీధి అడ్డాగా తయారయ్యింది. స్థానిక కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ఉన్న ప్రధాన రహదారి అంబేడ్కర్ రోడ్‌కు అనుసంధానంగా కొట్టేటి కోటయ్య వీధి ఉంది. ఈ వీధికి కుడి చేతి వైపు అంతా కొండ ప్రాంతం. ఎడమ చేతి వైపు నివాసాలు, టిఫిన్ బళ్లు ఉన్నాయి. ఈ వీధిలో మొత్తం 11 అడ్డరోడ్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో నివసించేవారంతా పేద, మధ్య తరగతికి చెందిన చిరు ఉద్యోగులు, రోజువారీ పనులు చేసుకుంటూ, ఆటో నడుకుంటూ జీవనం సాగిస్తున్నవారే. వారిలో కొండపైనే కాకుండా దిగువన ఉంటున్నవారిలో కూడా ద్విచక్రవాహనాలు ఉన్నవారు కొట్టేటి కోటయ్య వీధిలో రోడ్డుకు ఒక పక్కన పార్కింగ్ చేసుకుంటున్నారు. ఆటోల పార్కింగ్ కూడా సేమ్ టు సేమ్. అయితే గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ కొందరు స్థానికులు అటువంటి దురలవాట్లు ఉన్న స్నేహితులతో కలిసి ఇక్కడ హల్‌చల్ చేస్తున్నారు. ఇందులో బ్లేడ్ బ్యాచ్ కూడా ఉండటం గమనార్హం. మద్యం, డ్రగ్స్ కోసం దారి నిపడి వెళుతున్నవారిని అడ్డగించి బెదిరించి డబ్బు గుంజుకోవడం పరిపాటిగా మారింది.

వాహనాల దహనం గంజాయి బ్యాచ్ పనే...

గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యం సేవించే బ్యాచ్ ఆ మత్తులో ఏం చేస్తున్నారో.. ఎప్పుడు ఏం చేస్తారోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



మందు, గంజాయి బ్యాచ్ స్థావరం

అర్ధరాత్రి అపరాత్రి తేడా తెలియకుండా ఇళ్ల ముందే ఆటోలు పెట్టి దానిలోనే మద్యం, గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం, మత్తు ఎక్కువై వారిలోవారే కొట్టుకోవడం, కేకలు, అరుపులతో బెంబేలెత్తిపోయి నిద్రకూడా పట్టటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 9 గంటల దాటితే ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నామని వాపోతున్నారు. కాగా ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో కొట్టేటి కోటయ్య వీధిలో ఇళ్ల ముందు (రోడ్‌కు పక్కన) పార్క్ చేసి ఉన్న నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక అంతర్గత రోడ్‌లో మరో బైక్, ఇంకో అడ్డరోడ్‌లో దండెంపై ఆరేసిన దుస్తులపై పెట్రోలు పోసి దగ్ధం చేసిన సంగతి తెలిసిందే. ఇవన్నీ గంజాయి, బ్లేడ్ బ్యాచ్ పనేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

పోలీస్ పెట్రోలింగ్ లేకే బ్యాచ్ ఆగడాలు...

కొట్టేటి కోటయ్య వీధిలో పోలీస్ పెట్రోలింగ్ (రాత్రి గస్తీ) లేకే గంజాయి, మద్యం, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. వాళ్లు చేస్తున్న దురాగతాలపై భవానీపురం పోలీసులకు చెబితే మెన్ లేరని, ప్రజా ప్రతినిధుల బందోబస్తు విధుల్లో తలమునకలై పోతున్నామని చెబుతుంటే ఏం చెయ్యాలో అర్ధంకాక తలలు పట్టుకోవల్సిన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేసినా ఐదు వాహనాలు దహనం అయ్యేవి కాదని వ్యాఖ్యానిస్తున్నారు. కలకలం రేపిన వాహనాల దహనం కేసుపై భవానీపురం పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు తట్టుకోలేక పోలీసులు సంఘటనా స్థలానికి దూరంగా ఉన్న కబేళా సెంటర్‌కు చెందిన విద్యార్థిని బలిపశువును చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చీకటి ప్రదేశాలను స్థావరంగా చేసుకుని....

అంబేడ్కర్ రోడ్‌కు కొట్టేటి కోటయ్య వీధికి అనుసంధినంగా ఉన్న మలేరియా హాస్పటల్, మున్సిపల్ డిస్పెన్సరీ మధ్య, అదే విధంగా మూతబడిన వీఎమ్‌సీ జిమ్ పక్కన రాత్రి వేళల్లో చిమ్మచీకటిగా ఉంటుంది. అటు అంబేడ్కర్ రోడ్ ఇటు కొట్టేటి కోటయ్య వీధిలో రాకపోకలు సాగించేవారికి ఎవరికీ కనబడని క్రమంలో ఆ ప్రదేశాలనే బ్యాచ్ స్థావరాలుగా ఏర్పాటు చేసుకుని అక్కడే మద్యం, గంజాయి సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వారి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు పిర్యాదు చేస్తే వారు సైరన్, విజిల్స్ వేసుకుంటూ వచ్చే సరికి వారంతా కొండపైకి పారిపోతుండటం సర్వసాధారణమై పోయిందని అంటున్నారు.



గంజాయి, మద్యం బ్యాచ్ అడ్డాగా ఉన్న కొట్టేటి కోటయ్య వీధి

నగరంలో నటి మీనాక్షి చౌదరి సందడి



షోరూంలో ఆభరణాలు ప్రదర్శిస్తున్న మీనాక్షి చౌదరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో సినీనటి మీనాక్షి చౌదరి శనివారం సందడి చేశారు. మహాత్మాగాంధీరోడ్డులో ఏర్పాటు చేసిన ఎమ్మడి సిల్వర్ జ్యూవెలరీ షోరూమ్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా షోరూమ్‌లో ఆకట్టుకునే డిజైన్‌లతో ఉన్న వెండి ఆభరణాలను చూసి ముగ్ధురాలైంది. అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఆభరణాలు ఇప్పుడు విజయవాడలో అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఆమె చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సీఈఓ ఎమ్మడి సునీత, మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యాన ఆదివారం నుంచి 28 రోజులపాటు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో టీచర్స్‌కాలనీ మూడో లైన్‌లోని అజయ్‌హైస్కూల్‌లో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రధాన యోగాచార్యులు డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు.



సార్లు ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లాక ఎక్కడి చెత్త అక్కడే ఉండగా శుభ్రం చేసేందుకు సమాయత్తమవుతున్న కార్మికులు



గొల్లపూడి గ్రామంలో చీపుర్లు చేత పట్టి ఫొటోలకు ఫోజులిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తదితరులు

ఫోజులిచ్చారు... వెళ్లిపోయారు..

ఎన్టీఆర్‌జిల్లా గొల్లపూడి పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. ప్రజలతో ప్రతిజ్ఞలు చేయించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పలువురు టీడీపీ నాయకులతోపాటు కలెక్టర్ జి.లక్ష్మీశ తదితరులు ఇదిగో ఇలా ఫొటోలకు ఫోజులిచ్చారు. అంతే ఎక్కడ చెత్త అక్కడ వదిలేసి సార్లు కార్లు ఎక్కేసి వెళ్లి పోయారు. ఆ తర్వాత మాపని మాకు తప్పదు కదా అన్నట్టు పారిశుద్ధ్య కార్మికులు వారి పనిలో వారు మునిగిపోయారు.

– కిషోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

- తక్షణమే జీవీపీలను తొలగించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

భవానీపురం(విజయవాడపశ్చిమ): బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంట వ్యర్థ పదార్థాలను వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి – జక్కంపూడి రోడ్‌లోని అనధికార గార్బేజ్ వనరబుల్ పాయింట్స్(జీవీపీ)లను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న గార్బేజ్ వనరబుల్ పాయింట్స్‌ను తక్షణమే తొలగించాలని, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమేరాలతో పాటు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీ శ మాట్లాడుతూ.. పచ్చదనం – పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చి జిల్లాను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు జీవీపీలపై ప్రత్యేక దృష్టి సారించి వారం రోజుల్లోపు వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే వ్యర్థాలను వేయాలని హోటల్ యజమానులు, వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.



గొల్లపూడి డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్ లక్షీశా, అధికారులు

80 టన్నుల వర్మి కంపోస్ట్ తయారు..

జిల్లాలో ప్రస్తుతం సంపద తయారీ కేంద్రాల నుంచి 50 నుంచి 80 టన్నుల వర్మి కంపోస్ట్ తయారవుతుందని కలెక్టర్ చెప్పారు. క్లీనింగ్ డ్రైవ్‌ల ద్వారా శిథిలాల తొలగింపు, మూసుకుపోయిన కాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయటం, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్స్‌ను శానిటైజ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా గొల్లపూడి – జక్కంపూడి రోడ్‌లోని డంపింగ్ యార్డ్‌లో ఆయన మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి, డీపీఓ జీఎస్ఎల్ రాఘవన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, రూరల్ తహసీల్దార్ బి.సుగుణ, ఎంపీడీఓ బి.విగ్గిన్స్, పంచాయతీ సెక్రటరీ ఎం.స్వరూపరాణి, ప్రత్యేక అధికారి ఎం.ప్రసాద్, స్థానిక నాయకులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతపై దాడి చేసిన మాజీ కార్పొరేటర్

- కులం తక్కువ వాడా అంటూ దుర్భాషలు
- ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఘటన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 42 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడుని అదే పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ నడిరోడ్డుపై అవమానించారు. అందరి ఎదుట కాలుతో తన్ని... కులం తక్కువ నా కొ.. కా అంటూ దుర్భాషలాడాడు. అతనిపై ఏకంగా దాడికి దిగాడు. ఎన్టీఆర్ ఫ్లెక్సీ సాక్షిగా భవానీపురం శివాలయం సెంటర్‌లో టీడీపీలోని బీసీ నేతకు జరిగిన అవమానం ఇది. టీడీపీ పార్టీ డివిజన్ అధ్యక్షుడిని మాజీ కార్పొటర్ కాలుతో తన్నుతున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ ఘటన పశ్చిమ నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.... భవానీపురం 42 డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శివాజీ శుక్రవారం రాత్రి శివాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అక్కడ ఎన్టీఆర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన టీడీపీ మాజీ కార్పొరేటర్ రామయ్యకు డివిజన్ అధ్యక్షుడు శివాజీకి మధ్య వాగ్వాదం జరిగింది. మాదే రాజ్యం... ఈ సెంటర్ నా అడ్డా అంటూ శివాజీపై రెచ్చిపోయాడు. అంతటితో ఆగకుండా తక్కువ కులం వారికి పదవులు ఇస్తే ఇలాగే ఉంటుందంటూ అవమానకరంగా మాట్లాడాడు.



శివాజీపై దాడి చేస్తున్న దృశ్యం

అందరూ చూస్తుండగానే బీసీ సామాజిక వర్గానికి చెందిన శివాజీపై దాడికి పాల్పడ్డాడు. కాలుతో తన్ని... తక్కువ కులం నా కొ...కా అంటూ అవమానకరంగా మాట్లాడాడు. కాలుతో తన్నడంతో శివాజీ కింద పడిపోయాడు. ఆ సమయంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. శివాజీ , అతని సోదరుడు ఇద్దరి సెల్‌ఫోన్లు లాక్కుని ఇష్టానుసారం బూతులు తిట్టాడు. చివరికి ఈ వ్యవహారం పోలీసు స్టేషన్‌కు చేరింది. మాజీ కార్పొరేటర్ పార్టీ డివిజన్ అధ్యక్షుడుని కాలుతో తన్ని.. దాడికి చేసిన ఘటన సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోంది. మాజీ కార్పొరేటర్ తీరు, వ్యవహారశైలి, పోలీసు స్టేషన్‌లో చేస్తున్న పంచాయితీలు...వీటన్నిటిపై నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటలు అంటూ వాట్సాప్ గ్రూపుల్లో స్వైర విహారం చేస్తోంది. టీడీపీలోని బీసీలు, ఇతర బీసీ సంఘాలు మాజీ కార్పొరేటర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ..."ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం చేస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ రామయ్యతో పాటు అందరికీ సమాచారం ఇచ్చాను. శివాలయం సెంటర్‌లో వర్ధంతి చేయడం లేదని చెప్పడంతో ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశాను. అప్పుడు వచ్చి నా చొక్కా పట్టుకుని.. బూతులు తిట్టాడు. మాట్లాడితే బీసీ అంటూ కామెంట్లు చేస్తున్నాడంటూ డివిజన్ అధ్యక్షుడు తన వారి వద్ద బాధపడుతూ మాట్లాడిన వీడియో సైతం వాట్సాప్ గ్రూపుల్లో తిరుగుతోంది.

నగర పరిశుభ్రత అందరి బాధ్యత

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగర పరిధిలోని 64 వార్డులలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు జరిగాయి. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని భీమనవారి పేటలో జరిగిన కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి, సెంట్రల్‌లో స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తూర్పు నియోజకవర్గ పరిధిలోగల మారుతీ కో ఆపరేటివ్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు పాల్గొని ఆయా ప్రాంతాల్లోని ప్రదేశాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యర్థాలను కేవలం మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన డస్ట్ బిన్స్‌లో మాత్రమే వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పరిశుభ్రతను దైనందిన కార్యక్రమాలో ఒక అంశంగా పెట్టుకోవాలని సూచించారు. విజయవాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలోని 286 సచివాలయాల పరిధుల్లో నిత్యం వ్యర్థాలు పేరుకుపోయే ప్రదేశాలను శుభ్రం చేసి వాటిని అందంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. డ్రెయిన్లలోని వ్యర్థాలను తొలగించి పూడిక తీసి మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్, ఆర్‌డీఓ చైతన్య కుమార్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి



చేపల రేవు వద్ద శుభ్రం చేస్తున్న రెహమతున్నీసా

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ):పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు డివిజన్‌తో పాటు నగరం పరిశుభ్రంగా మారుతుందని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ డివాస్ కార్యక్రమంలో భాగంగా గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో పారిశుద్ధ్య సిబ్బందితో కలసి ఆయన పరిసరాలను శుభ్రపరిచారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని షేక్ రాజాసాహేబ్ ప్రసూతి ఆసుపత్రిలో ఆరోగ్య, పారిశుద్ధ్య సిబ్బంది ఆసుపత్రిలోని పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం ఆసుపత్రి నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రాజేష్, అప్పాజీ, డాక్టర్‌లు శివప్రసాద్, గౌస్‌బాషా, సాయిరాం, బిందు, ఆరోగ్య సిబ్బంది,పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో స్వచ్ఛ దివస్

భవానీపురం(విజయవాడపశ్చిమ):నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా 38వ డివిజన్‌లో శనివారం జరిగిన పరిశుభ్రత కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని చేపల రేవు ప్రాంతంలో చెత్త, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. అలాగే సైడు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి అందులోని మురుగు నీరు సజావుగా పారుదల అయ్యేలా శుభ్రం చేశారు.

కూటమి ప్రభుత్వానికి వలంటీర్ల ఉసురు తగులుతుంది

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వానికి వలంటీర్ల ఉసురు తప్పక తగులుతుందని ఏపీ స్టేట్ వలంటరీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో చంద్రబాబు ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందన్నారు. గ్రామ వలంటీర్లను దారుణంగా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. హామీ అమలు చేయాలని ప్రభుత్వానికి తమ గోడు వెళ్లబోసుకునేందుకు వలంటీర్లు ప్రయత్నిస్తే ఈ నెల 16న వారిని అరెస్టులు చేసి 151 నోటీసులు ఇచ్చి రాజద్రోహం కేసులు పెడతామని బెదిరించడం దుర్మార్గమన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పిన చంద్రబాబు మోసం చేస్తే ఆయనకు పవన్, లోకేష్ తానా తందానా అని వంత పాడటం సరికాదన్నారు. వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకుని రూ.10 వేలు వేతనవం ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు, కార్యదర్శి జి.మమత, జంగాల చైతన్య, దుమ్ము రమేష్, పి.నరేష్, షైనీ, స్వప్న పాల్గొన్నారు.

సడక్ సురక్ష జీవన్ రక్ష పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడ తూర్పు):రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్ శనివారం సడక్ సురక్ష జీవన్ రక్ష అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా రోడ్డు సేఫ్టీ యన్‌జీఓ ఎన్టీఆర్ జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు బేతు రామ మోహన్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార సామగ్రి కరపత్రాలు, గోడ పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆర్‌కే సింగ్ మాట్లాడుతూ సడక్ సురక్ష జీవన్ రక్ష అనే నినాదంతో ప్రచారం చేయాలని, వాహన వినియోగ దారులు తప్పని సరిగా రహదారి భద్రత పై అవగాహన కలిగి ఉండాలన్నారు.